


గంజాయి నిర్మూలనకు వ్యూహాలు
జిల్లాలో గంజాయిని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు మరింతగా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. 8లో



వెలవెలబోతున్న డముకు
అరకు–విశాఖ ప్రధాన రహదారి ఆనుకున్న డముకు వ్యూపాయింట్ నిర్మానుష్యంగా మారింది. 8లో



విశాఖ రైతు బజార్లకు మన్యం కూరగాయలు
విశాఖపట్నంలో రైతు బజార్లకు మన్యం కూరగాయలు తరలిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు



తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

చింతపల్లిరూరల్: గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్ బాషా అన్నారు. డాక్టర్ రామస్ స్వాతి వమాన్, డాక్టర్ సుకుమార్‌తో కలసి డీఎంహెచ్‌వో మండలంలో లోతుగడ్డ పీహెచ్‌సీని సందర్శించారు.ఎన్‌క్యూఎస్ ధ్రువీకరణకు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసినట్టు వారు తెలిపారు. ఆస్పత్రిలో రోగులు, గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. జిల్లాలో క్వాలిటీ కన్సల్టెంట్ ఎం.ఎస్.లలిత,పీహెచ్‌సీ వైద్యాధికారులు లక్ష్మీకాంతం, జానకి పాల్గొన్నారు.

పాపికొండల విహారానికి భారీగా పర్యాటకులు

దేవీపట్నం: గోదావరిలో బోటుప్రయాణం చేస్తూ పాపికొండల అందాలనువీక్షించేందుకు శనివారం 350మంది పర్యాటకులు వచ్చారు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకున్న పర్యాటకులు రాజమహేంద్రవరంనుంచి వాహనాల్లో పోశమ్మ గండికి చేరుకుని, ఉదయం ఆరు బోట్లలో పటిష్ట భద్రత నడుమ పేరంటపల్లికి వెళ్లారు. సాయంత్రం తిరిగి పోశమ్మగండికి చేరుకున్నారు.

మద్యం దుకాణాల మూసివేత

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పాడేరు డివిజన్‌లోని మద్యం దుకాణాలను శనివారం సాయంత్రం 4గంటల నుంచి మూసివేయడంతో పాటు ఎస్‌ఈబీ అధికారులు సీజ్ చేశారు. 19మద్యం రిటైల్ అవుట్‌లెట్లు, అనంతగిరి,అరకులోయ మండలాల్లో టూరిజంశాఖ నిర్వహిస్తున్న బారులను కూడా మూసివేశారు. పోలింగ్ పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలన్నీ మూసి వేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా ఆదేశాలు జారీ చేశారు.

అజాగ్రత్త వల్లే అడవుల్లో మంటలు



బోర్డును పరిశీలిస్తున్న సూర్యనారాయణ పడాల్

జి.మాడుగుల: అడవుల్లో మంట లు చెలరేగేందుకు అజాగ్రత్తే ప్రధాన కారణమని, దీని వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుందని చింతపల్లి డివిజన్ అటవీ శాఖ అధికారి సీహెచ్ సూర్యనారాయణ పడాల్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతా ల్లోని ప్రజలు వన్య మృగాలను సంరక్షించాలని, ప్లాస్టిక్ నిషేధించాలని కోరారు. కొంతమంది నిర్లక్ష్యమే అటవీ ప్రాంతాల్లో మంటలు చెలరేగేందుకు కారణమవుతోందని, అందువల్ల అడవుల్లో అగ్గి పెట్టవద్దని ఆయన సూచించారు. అడవుల్లో మంటలను అరికట్టాలని రూపొందించిన బోర్డులను జి.మాడుగుల నుంచి చింతపల్లి వరకు అటవీశాఖ సిబ్బంది ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో అన్నవరం అటవీశా ఖ సెక్షన్ అధికారి వెంకటరావు, ఎఫ్‌బీవో శ్రీనివాస్, ప్రసాద్, ఏబీవో జె.దివ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

పెదబయలు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 13న జరగనున్నందున స్థానిక ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెదబయలు సమీపంలోని అరడకోట వరకు ఉన్న కల్వర్టులు,వంతెనలు, పోలింగ్ జరిగే పాఠశాల ఆవరణలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

పట్టభద్రుల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- 37 మంది అభ్యర్థులు.. 2,89,214 మంది ఓటర్లు
- రేపు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- ఆరు జిల్లాల పరిధిలో 331 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు
- 2,038 మంది పోలింగ్ సిబ్బంది, అధికారుల పర్యవేక్షణ
- 840 మంది పోలీసుల భద్రతలో పోలింగ్ నిర్వహణ
- మన్యం, అల్లూరి జిల్లాల పోలింగ్ స్టేషన్లలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్
- 'సాక్షి'తో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ మల్లికార్జున





స్వర్ణభారతి స్టేడియంలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లు పరిశీలిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆరు జిల్లాల పరిధిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం కలెక్టర్ డా.మల్లికార్జున తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలతో ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లోనూ ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేసేందుకు అధికారులతో పహారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 13న జరిగే పోలింగ్ కోసం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని 331 పోలింగ్ స్టేషన్లకు సామగ్రితో పాటు, ఎన్నికల సిబ్బందిని పంపించినట్లు 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో స్ట్రైకింగ్ ఫోర్స్

ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని చర్యలూ చేపట్టాం. అభ్యర్థులు పోలింగ్ సమయంలో ఏం చేయకూడదనే అంశంపై శనివారం సాయంత్రం చివరి సమావేశం ఏర్పాటు చేసి నిబంధనలు వివరించాం. మొత్తం ఆరు జిల్లాల పరిధిలో 34 ఆక్సిలరీ స్టేషన్లతో కలిసి మొత్తం 331 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పార్వతీపురం మన్యం పరిధిలో 12, అల్లూరి జిల్లాలో 15 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లలో స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్‌ఫోర్స్, పారామిలటరీ దళాలను వినియోగిస్తున్నాం. ప్రతి పోలింగ్‌స్టేషన్‌లోనూ వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశాం.

ఏ పోలింగ్ స్టేషన్.. సిబ్బందికి తెలీదు

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 2,038 మంది సిబ్బందికి రెండు విడతల్లో శిక్షణ తరగతులు నిర్వహించాం. పోలింగ్ సమయంలో ఏ విధంగా విధులు నిర్వర్తించాలి, బ్యాలెట్ బాక్సులను ఎలా భద్రపరిచి స్ట్రాంగ్ రూమ్‌కి తీసుకురావాలి. కౌంటింగ్ సమయంలో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై శిక్షణ పూర్తయింది. సిబ్బందికి ఎన్నికల విధులు అప్పగించే విషయమై రెండు సార్లు ర్యాండమైజేషన్ తయారు చేసి గ్రూప్‌లుగా విభజించాం. ఏ జిల్లా పరిధిలో పని చేస్తారనేది తెలియజేశాం. కానీ ఎవరు ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వర్తించాలన్నది ఆదివారం తెలియజేసిన వెంటనే విధులకు బయలుదేరనున్నారు. ప్రతి జిల్లాలోనూ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఓటింగ్ పూర్తయిన తర్వాత ఎంత ఆలస్యమైనా అదే రోజు బయలుదేరి విశాఖలో ఏర్పాటు చేసిన మెయిన్ స్ట్రాంగ్‌రూమ్ స్వర్ణభారతి స్టేడియంకి భద్రత నడుమ బ్యాలెట్ బాక్సులు తీసుకురావాలి. ఇక్కడ ప్రతి జిల్లాకో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశాం. వాటిలో బ్యాలెట్ బాక్సులను భద్రపరచాలి.

అన్నీ పెద్ద బ్యాలెట్ బాక్సులే..

ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 1, 119 బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నాం. అన్నీ పెద్ద బాక్సులు మాత్రమే వాడుతున్నాం. 200 నుంచి 600 మధ్యలో ఓటర్లున్న స్టేషన్లలో రెండు బాక్సులు, 600 నుంచి 1100 మధ్యలో ఉంటే మూడు బాక్సులు, 1100 దాటిన పోలింగ్ స్టేషన్లలో 4 బాక్సులు వినియోగిస్తున్నాం. అన్ని బ్యాలెట్ బాక్సులకు ప్రత్యేక కోడ్ ఏర్పాటు చేశాం.

5,325 బ్యాలెట్ పత్రాల్లో ముద్రణ లోపాలు

బ్యాలెట్ పేపర్లు, రిజర్వ్ సంఖ్యతో కలిపి ఇప్పటికే పంపిణీ పూర్తి చేశాం. కర్నూలులో ప్రింట్ పూర్తయి వచ్చిన ప్రతి బ్యాలెట్ పత్రాన్ని పరిశీలించాం. ఇందులో 5,325 డిఫెక్టివ్ బ్యాలెట్ పత్రాలు వచ్చాయి. అంటే ఈ బ్యాలెట్ పత్రాల్లో పేర్లు ఉన్నాయి కానీ.. సీరియల్ నంబర్లు లేవు. 1 నుంచి 31 వరకు సీరియల్ నంబర్లు ముద్రించలేదు. వీటని పక్కన పెట్టి ఈ అంశంపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌కు లేఖ రాశాం. వాటిని ఏం చేయాలన్న అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ బ్యాలెట్ పత్రాలు తీసేసినప్పటికీ.. సరిపడా ఉన్నాయి. ఫారం–12 ప్రకారం పోస్టల్ బ్యాలెట్ కోసం 1,214 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు 748 మందికి పోస్టల్ బ్యాలెట్‌లు పంపించాం. ఆదివారం కూడా మరికొందరికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఓటరు స్లిప్పుల పంపిణీ దాదాపు 95.91 శాతం పూర్తయింది. ఆబ్సెంట్, డూప్లికేట్, షిఫ్టింగ్ మొదలైన ఓటర్ల జాబితాలను ఆయా పోలింగ్ స్టేషన్ల ప్రిసైడింగ్ అధికారులకు పంపిస్తాం.

డిగ్రీ సర్టిఫికెట్ చూపించి కూడా..

గ్రాడ్యుయేట్ ఓటర్లు ఎన్నికల కమిషన్‌కు సంబంధించి ఎపిక్ కార్డు/ఆధార్ కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/పాన్ కార్డు/పాస్‌పోర్టు చూపించి ఓటు వేసుకోవచ్చు. కేవలం ఎపిక్ కార్డు ఉండాలన్న నిబంధనలేమీ లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేట్ ఉద్యోగులు కూడా తమ సర్వీస్ ఐడెంటిటీ కార్డు చూపించి ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నాం. ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ అఫీషియల్ ఐడీ కార్డు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఇవేమీ లేకపోయినా డిగ్రీ సర్టిఫికెట్ తీసుకొచ్చి చూపించి కూడా ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నాం. దివ్యాంగులు కూడా ఆ ఐడీ కార్డు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. 13వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు పోలింగ్ స్టేషన్ లోపలికి వచ్చే వారికి మాత్రమే ఓటు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తాం.

పకడ్బందీగా ఏర్పాట్లు

ప్రతి జిల్లాలోనూ బందోబస్తు పటిష్టంగా నిర్వహించాం. ఇప్పటివరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. వాటికి సంబంధించిన నివేదికలు సమర్పించాం. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా పోలింగ్ నిర్వహించనున్నాం. ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్‌ల వద్ద ఏర్పాట్లు చేశాం.

బ్యాలెట్ బాక్సులు, పత్రాలు పంపిణీ ఇలా..

జిల్లా	బ్యాలెట్ బాక్సులు	బ్యాలెట్ పత్రాలు
శ్రీకాకుళం	292	54,200
విజయనగరం	229	60,600
పార్వతీపురం మన్యం	62	19,300
విశాఖపట్నం	18	12,000
అల్లూరి సీతారామరాజు	358	1,09,400
అనకాపల్లి	160	44,200
రిజర్వ్	--	5,325
మొత్తం	1119	3,05,025

జిల్లాల వారీగా ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల వివరాలు

జిల్లా	పోలింగ్ స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
శ్రీకాకుళం	59	36,411	15,840	05	52,256
విజయనగరం	72	38,625	19868	09	58502
పార్వతీపురం మన్యం	24	12,516	6,002	02	18,520
అల్లూరి సీతారామరాజు	15	7861	3661	03	11,525
విశాఖపట్నం	112	58,364	47320	13	1,05,697
అనకాపల్లి	49	28,370	14,338	06	42,714
మొత్తం	331	1,82,147	1,07,029	38	2,89,214

48 గంటలు డ్రై డే

శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ పోలింగ్ ముగిసే సాయంత్రం 4 గంటల వరకూ 6 జిల్లాల్లోనూ డ్రై డే నిర్వహిస్తున్నాం. ఈ 48 గంటల పాటు ఎక్కడా మద్యం అమ్మకాలు చేపట్టకూడదు. పోలింగ్ సెంటర్లు, కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేసిన ఇన్‌స్టిట్యూట్‌లు, కార్యాలయాలకు 12, 13 తేదీల్లో సెలవులుగా ప్రకటించాం. కౌంటింగ్ సమయంలో లోకల్ హాలిడేలు కూడా ఇవ్వాలని నిర్ణయించాం. ఓటు వేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ రోజున స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను వినియోగించుకోవచ్చు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసే వారిలో ఎవరికి ఓటు హక్కు ఉందో వారి షిఫ్ట్‌లో మార్పులు చేయడం, లేదా ఓటు వేయడానికి అనుమతి ఇవ్వడం చేయాలని ఆదేశించాం.

- 6 జిల్లాల పరిధిలో 75 రూట్లలో పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు 66 బస్సులు ఏర్పాటు చేశారు.
- శ్రీకాకుళం జిల్లా పరిధిలో 383 మంది, విజయనగరంలో 455, మన్యంలో 145, అల్లూరిలో 94, విశాఖపట్నంలో 657, అనకాపల్లిలో 304 మంది చొప్పున మొత్తం 2,038 మంది ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు.
- ఆరు జిల్లాల పరిధిలో 393 పీవోలు, 394 మంది ఏపీవోలు, 848 ఓపీవోలు, 403 మంది మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌ను పర్యవేక్షించనున్నారు.
- శ్రీకాకుళంలో 899 మంది, విజయనగరంలో 1063, మన్యంలో 396, అల్లూరిలో 230 మంది, విశాఖపట్నంలో 1142, అనకాపల్లిలో 691 మంది చొప్పున మొత్తం 4,420 మంది పోలీసులు పహారా కాస్తున్నారు. వీరితో పాటు 8 పీఎల్‌టీలు, 10 పార్టీలు, ఒక ఏపీఎస్‌పీ బృందం, 4 సెక్షన్ ఎస్ఏపీ బృందాలు విధులు నిర్వర్తించనున్నాయి.
- 2017 ఎన్నికల్లో 1,55,930 మంది ఓటర్లుండగా 1,08,857 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 69.78 శాతం పోలింగ్ నమోదైంది.

బ్యాలెట్‌పై తొలి ప్రాధాన్య ఓటు తప్పనిసరి

- లేదంటే చెల్లని ఓటుగా పరిగణిస్తాం
- అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరిగే 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు రాజకీయ స్వభావంతో కూడిన సందేశాలు పంపడం, ఫోన్ కాల్స్ ద్వారా ప్రచారం నిర్వహించొద్దని రిటర్నింగ్ అధికారి డా.మల్లికార్జున అభ్యర్థులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం పోలింగ్, ఎన్నికల నియమావళిపై బరిలో ఉన్న 37 మంది అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. బల్క్ మేసేజ్‌ల పేరుతో ఉల్లంఘన జరిగితే ఎన్నికల నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఓటింగ్ వేసే విధానాన్ని అభ్యర్థులకు వివరించారు.

బ్యాలెట్‌పై తొలి ప్రాధాన్య సంఖ్య ఒకటి తప్పనిసరిగా వేయాలని, లేదంటే ఆ ఓటు చెల్లనిదిగా పరిగణిస్తామన్నారు. ఎన్నికల సిబ్బంది ఇచ్చిన వయొలెట్ రంగు స్కెచ్ పెన్‌తో మాత్రమే నంబర్స్ వేయాలన్నారు. అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్ల కోసం సంబంధిత పోలింగ్ కేంద్రంలో 12వ తేదీ సాయంత్రం నుంచి ఫారం–10 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల కోసం ఫారం–18 ద్వారా రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- పాడేరు డివిజన్‌లో 11,525 మంది ఓటర్లు
- 15 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- జేసీ శివశ్రీనివాస్



తలారిసింగి ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జేసీ శివశ్రీనివాస్

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. పాడేరులోని తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్,రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ను కూడా అందుబాటులో ఉంచారు. బ్యాలెట్ బాక్స్‌లను కలెక్టరేట్‌లో భద్రపరిచి, బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పేపర్లు,ఇతర మెటీరియల్ పరిశీలన కార్యక్రమాన్ని కూడా పూర్తి చేశారు. తలారిసింగి పాఠశాల ఆవరణలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈనెల 13వ తేదీన జరిగే పోలింగ్ కోసం ఆదివారం ఉదయం నుంచి రూట్‌ల వారీగా ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో ఎన్నికల సిబ్బందిని తరలించనున్నారు.

తలారిసింగి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్ శనివారం పరిశీలించారు.టెంట్లు,కుర్చీలు,ఇతర సామగ్రిని పూర్తిస్థాయిలో ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో 15పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి నలుగురు చొప్పున అధికారులను నియమించామని తెలిపారు. రిజర్వ్‌తో సహా 36మంది పోలింగ్ అధికారులు,36మంది సహాయ పోలింగ్ అధికారులు,72మంది ఇతర పోలింగ్ అధికారులు,18మంది మైక్రో పరిశీలకులు,వెబ్ కేస్టింగ్‌కు 15మంది వీడియోగ్రాఫర్లను నియమించినట్టు చెప్పారు.

వారంతా ఆదివారం ఉదయం 7గంటలకు తలారిసింగి పాఠశాలకు చేరుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఆయన తెలిపారు. ఐదు జోన్లు,ఐదు రూట్‌లుగా విభజించి ఐదుగురు ప్రత్యేకాధికారులు,ఐదుగురు జోనల్,రూట్ అధికారులను, అదనంగా ఆరుగురు ప్రత్యేకాధికారులను నియమించినట్టు చెప్పారు. పాడేరు,అరకులోయ నియోజకవర్గాలకు సంబంధించి 11,525మంది ఓటర్లు ఉన్నారని, ఎన్నికల నిబంధనల మేరకు 15పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జేసీ తెలిపారు.

వేసవిలోనూ నిరంతర విద్యుత్

జెన్‌కో డైరెక్టర్ సత్యనారాయణ



మాచ్‌ఖండ్ ప్రాజెక్టులో మరమ్మతులకు గురైన 6వ నంబర్ జనరేటర్‌ను పరిశీలిస్తున్న జెన్‌కో డైరెక్టర్ సత్యనారాయణ

ముంచంగిపుట్టు/సీలేరు: వేసవిలోనూ నిరంతరం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా చేయడమే లక్ష్యంగా జెన్‌కో చర్యలు తీసుకుంటోందని ఏపీ జెన్‌కో డైరెక్టర్ (హైడల్) ఎం.వి.వి.సత్యనారాయణ తెలిపారు. సీలేరు కాంప్లెక్స్, పొల్లూరు, డొంకరాయి, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. సీలేరులో యూనిట్ పనితీరు, గ్రిడ్‌కు వెళ్తున్న విద్యుత్ సరఫరాను పరిశీలించారు. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో నిరంతరం విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల ప్రాజెక్టులో టీపీ డ్యాం వద్ద ట్రాస్‌రాక్స్ పడిపోవడంతో ఐదు రోజులు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిన ఘటనపై సమీక్షించారు. మొదట డుడుమ డ్యాం, టీపీ డ్యాం, వాల్వ్ హౌస్, విద్యుత్ కేంద్రాలను, మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రంలో గత ఆరు నెలలుగా నిలచిపోయిన 6వ నంబర్ జనరేటర్‌ను పరిశీలించారు. స్టాటర్ కాయిల్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం ప్రాజెక్టు అధికారులతో కంట్రోల్ రూంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముంచంగిపుట్టు, సీలేరుల్లో విలేకర్లతో మాట్లాడారు. విద్యుత్ కేంద్రంలో ట్రాస్‌రాక్ సమస్యల వల్ల మళ్లీ విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నాన్‌ప్రైజర్ టన్నెల్ వద్ద ఒకట్రాస్‌రాక్‌ను (జాలీగేట్) ఏర్పాటు చేయాలని ప్రాజెక్టు అధికారులను ఆదేశించామని చెప్పారు. ప్రాజెక్టులో ఉన్న ఆరుజనరేటర్ల ద్వారా వేసవిలో 120మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకుంటామని, దీర్ఘకాలంగా మరమ్మతు లు గురైన 6వ నంబర్ జనరేటర్‌ను మరో రెండు వారాల్లోవినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు.

దేశంలో నంబర్‌వన్ కానున్న సీలేరు పంపింగ్ స్టోరేజ్ ప్రాజెక్టు

సీలేరులో పంపింగ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలవబోతోందని, ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ రాష్ట్రంలో పీక్ లోడ్ అవర్స్‌లో ఎంతో ఉపయోగపడుతుందని హైడల్ డైరెక్టర్ చెప్పారు. సీలేరు పంపింగ్ స్టోరేజ్ ప్రాజెక్టు ద్వారా తొమ్మిది యూనిట్లతో 1350 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జల విద్యుత్ కేంద్రం నిర్వహించేందుకు అన్ని సర్వేలు నిర్వహించామన్నారు. రూ.పదివేల కోట వ్యయంతో ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోతోందన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు కేంద్రం ప్రభుత్వం కూడా అనుమతి ఇచ్చిందని చెప్పారు. కృష్ణపట్నంలో 800 మెగావాట్లు, డాక్టర్ తాతారావు ప్రాజెక్టులో 800 మెగా వాట్లు, పొల్లూరులో 2వ దశ నిర్మాణంలో 230 మెగా వాట్లు, పోలవరంలో 80 మెగా వాట్ల చొప్పున 12యూనిట్లతో హైడల్ ప్రాజెక్టులను నిర్మించి 2026 నాటికల్లా రాష్ట్రానికి అందించనున్నట్టు ఆయన తెలిపారు. హైడల్, సోలార్, విండ్ ద్వారా 230 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి, సరఫరా చేస్తున్నామని, బయట నుంచి మరికొంత తీసుకొస్తున్నామన్నారు. సీలేరులో పంపింగ్ స్టోరేజ్ ప్రాజెక్టు వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఏప్రిల్ 1న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నామని తెలిపారు.

డైరెక్టర్‌ను కలిసిన సీలేరు ప్రజాప్రతినిధులు

సీలేరు పంపింగ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణంపై సీలేరు ప్రజాప్రతినిధులు హైడల్ డైరెక్టర్ సత్యనారాయణను కలిశారు. ప్రాజెక్టు నిర్మాణం మాకు ఆనందమేనని, అయితే ఇక్కడ ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత కల్పించి ఉద్యోగం, వైద్య సదుపాయం కల్పించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రశాంత్‌కుమార్, బాలకృష్ణ, బాబురావు, లక్ష్మీనారాయణ, మాచ్‌ఖండ్ ఎస్ఈ కె.వి.నాగేశ్వరరావు, మోతుగూడెం టెక్నికల్ ఈఈ బాలకృష్ణ, జనరేషన్ ఈఈ బి.గోవిందరాజులు, సివిల్ ఈఈ ఆదిత్య సామంత్రాయ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాకూరి సీతమ్మకు విప్లవ జోహార్లు

ప్రత్యేక లేఖలో ఆంధ్ర–ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్

జి.మాడుగుల: జీకే వీధి మండలం కొమ్ముల వాడ గ్రామంలో సీపీఐ (మావోయిస్టు) ఏవోబీ ఎస్‌జెడ్‌సీ సభ్యుడు కాకూరి పండన్న అలియాస్ జగన్ తల్లి కాకూరి సీతమ్మకు విప్లవ జోహార్లు అర్పిద్దామని సీపీఐ మావోయిస్టు ఆంధ్ర–ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పిలుపునిచ్చారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మృతికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల బాధలో పాలుపంచుకుంటూ సంతాపం ప్రకటించారు. ఫారెస్టు అధికారులు, వడ్డీ వ్యాపారుల దోపిడీ, దౌర్జన్యాలకు గురై అత్యంత పేదరికంలో జీవించిన సీతమ్మ స్వయంగా తన చిన్నకొడుకు కాకూరి పండన్నను విప్లవోద్యమంలోకి పంపించారని అన్నారు. పండన్న కోసం ఆమెను వేధించిన పోలీసులు సీతమ్మ అంత్యక్రియలకు హాజరై కటప ప్రేమ చూపారని విమర్శించారు.

విశాఖ రైతు బజార్లకు మన్యం కూరగాయలు

డుంబ్రిగుడ: విశాఖ రైతు బజార్లకు మన్యం కూరగాయలు తరలిస్తున్నారు. ఆదివారం విశాఖపట్నం రైతు బజార్లలో విక్రయించేందుకు శనివారం వీటి సేకరణలో గిరిజన రైతులు బిజీబిజీగా కనిపించారు. సొవ్వ పంచాయతీ దేముడువలస, మాలివలస, పనసవలస, కరకవలస గ్రామాల్లో క్యారెట్, ముల్లంగి, క్యాబేజీ, బ్రొకోలీ, చైనీస్ క్యాబేజీ, కాలీఫ్లవర్, బంగాళాదుంపలను సేకరించారు. గతేడాది కంటే ఈ ఏడాది క్యారెట్‌కు మంచి ధర పలుకుతోంది. గత వారం 50 కిలోల క్యారెట్‌కు రూ.1,200 నుంచి రూ.15 వందలు, క్యాబేజీ రూ.50 కిలోల బస్తా రూ.700 నుంచి రూ.800 వరకు ధర రావడంతో ఈ వారం పెద్ద ఎత్తున తరలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రత్యేక, రూట్ అధికారులు వీరే

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అరకులోయ,పాడేరు నియోజకవర్గాలకు మండలాల వారీగా ప్రత్యేకాధికారులు, జోనల్ అధికారులు,రూట్ అధికారులను ఎన్నికల సంఘం నియమించింది.

- రూట్–1లో అరకు,అనంతగిరి మండలాల్లోని మూడు పోలింగ్ బూత్‌లకు ప్రత్యేకాధికారిగా జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లోని మూడు పోలింగ్ బూత్‌లకు ప్రత్యేకాధికారిగా డ్వామా పీడీ రమేష్ రామన్, జోనల్ అధికారిగా ఉద్యానవన శాఖ ఏపీడీ పవన్‌కుమార్, రూట్ అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఎం.జయరామ్‌ను నియమించారు.
- రూట్ –2లో పెదబయలు, ముంచంగిపుట్టులోని రెండు బూత్‌లకు ప్రత్యేకాధికారిగా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళీ, జోనల్ అధికారిగా జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేష్‌కుమార్ రావు,రూట్ అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ పెదబయలు డీఈఈ గోపాలకృష్ణమూర్తి వ్యవహరిస్తారు.
- రూట్–3లో చింతపల్లి,కొయ్యూరు బూత్‌లకు ప్రత్యేకాధికారిగా ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ,జోనల్ అధికారిగా జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎం.వి.రామకృష్ణంరాజు,రూట్ అధికారిగా చింతపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రుక్మాంధరరాజు బాధ్యతలు నిర్వహిస్తారు.
- రూట్ 4లో జీకే వీధి,సీలేరు బూత్‌లకు ప్రత్యేకాధికారిగా పాడేరు సబ్‌కలెక్టర్ వి.అభిషేక్,జోనల్ అధికారిగా డ్వామా ఏపీడీ రామారావు,రూట్ అధికారిగా గిరిజన సంక్షేమశాఖ చింతపల్లి డీఈఈ చాణుక్య వ్యవహరిస్తారు.
- రూట్ –5లో పాడేరు,జి.మాడుగులలోని మూడు పోలింగ్ బూత్‌లకు ప్రత్యేకాధికారిగా రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్,జోనల్ అధికారిగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు,రూట్ అధికారిగా జి.మాడుగుల పంచాయతీరాజ్ డీఈఈ నరేష్‌కుమార్‌లను నియమించారు.

వెలుగు అవినీతి అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

రంపచోడవరం: డివిజన్ పరిధిలోని వెలుగు శాఖలో అవినీతి అక్రమాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి వెలుగు ఏపీడీ శ్రీనివాసుతోపాటు సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ సుమిత్ కుమార్‌కు గిరిజన సంఘం నాయకులతో కలిసి శనివారం ఆయన ఫిర్యాదు చేశారు. మారేడుమిల్లి మండల మహిళా సమైక్య ద్వారా చింతపండు, చీపుర్లు విక్రయించగా వచ్చిన మొత్తం సొమ్ముపై ఎటువంటి రికార్డులు, లెక్కలు నిర్వహించలేదన్నారు. ఏపీడీ శ్రీనివాసు కమీషన్‌కు విక్రయించట్లు అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. రంపచోడవరం పరిధిలోని నిర్వహిస్తున్న పసుపు యూనిట్ల మిషనరీ కొనుగోలుకు కమీషన్ తీసుకున్నారన్నారు. ఆ యూనిట్ల ద్వారా తయారు చేసిన పసుపునకు ఎంత లాభం వస్తుందో లెక్కలు, రికార్డులు లేవని ఆరోపించారు. వీటిపై సమగ్ర విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ప్రమాదపుటంచున ప్రయాణం


జీపునకు వేలాడుతూ ప్రయాణం

మారేడుమిల్లి: లోతట్టు గ్రామాల ప్రజలు ప్రమాదపుటంచున ప్రయాణం సాగిస్తున్నారు. ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణిస్తూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. మారేడుమిల్లి మండలంతోపాటు వై.రామవరం మండలం లోతట్టు గ్రామాలకు బస్సు సర్వీసులు అంతంత మాత్రమే ఉండటంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అవకాశంగా వాహనదారులు పరిమితికి మించి వాహనాల్లో ఎక్కించుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి శనివారం మారేడుమిల్లిలో వారంతపు సంతకు నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం గిరిజనులు తరలివస్తారు. వారికి సరిపడ బస్సులు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. శనివారం సంతకు ఆటో, జీపులలో ప్రయాణికులు వేలాడుతూ ప్రయాణిస్తున్న దృశ్యాలు కనిపించాయి. క్షేమంగా గమ్యానికి చేరితే సరేసరి.. పొరపాటున అదుపు తప్పితే పెను ప్రమాదం చోటు చేసుకునే అవకాశముందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత సంఘటనలను గుర్తుంచుకుని సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలి కోరుతున్నారు.

గంజాయి నిర్మూలనకు వ్యూహాలు

నెలవారీ సమీక్షలో ఎస్పీ సతీష్‌కుమార్

పాడేరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో గంజాయి సాగు, రవాణాను చాలా వరకు కట్టడి చేయగలిగామని భవిష్యత్తులో జిల్లాలో గంజాయి వాసన లేకుండా పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు మరింతగా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. పాడేరు పోలీసు శాఖ కార్యాలయంలో శనివారం నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. పాడేరు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో ఫిబ్రవరి నెలకు సంబంధించి గంజాయి, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, ఆత్మహత్యలు తదితర కేసులు, వాటి ప్రగతి వివరాలు తెలుసుకున్నారు. ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచిన కేసులు పెండింగ్‌లో లేకుండా వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి రవాణాపై మరింత కఠినంగా వ్యవహరించాలని, ప్రధాన మార్గాలు, ముఖ్య కూడళ్ల వద్ద విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను కొనసాగించాలన్నారు. ఫిర్యాదుదారులకు తగిన గౌరవం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) తుహిన్ సిన్హా, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిశోర్, రంపచోడవరం ఏఎస్పీ, పలువురు సీఐలు పాల్గొన్నారు.

భయంతోనే లోకేష్ తప్పుడు ఆరోపణలు

చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు


మాట్లాడుతున్న నర్సింగరావు, బీసీ నాయకులు

అరకులోయ రూరల్: భయంతోనే ప్రభుత్వంపైనా రాష్ట్ర చేనేత(ఆప్కో) చైర్మన్ గంజి చిరంజీవిపైనా టీడీపీ నేత నారా లోకేష్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చేనేత విభాగం(బీసీ) జిల్లా అధ్యక్షుడు గెడ్డం నర్సింగరావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక పార్టీ కార్యలయంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో చేనేత రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. అప్పట్లో మూతపడిన చేనేత పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం తెరిపిస్తుందన్నారు. అర్హులైన మగ్గం కార్మికులకు చేనేత కార్మిక నేస్తం ద్వారా ఏటా రూ.24 వేలు ఇస్తుందన్నారు. వాటిని కప్పి పుచ్చుకోవడం కోసమే నారా లోకేష్ విమర్శలు వేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోకపోతే ఆందోళనకు సిద్ధమని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నాయకులు ఎస్ రమణ, సత్యనారాయణ(ఆర్కే)గంగరాజు, సత్తిబాబు, రామారావు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న డముకు


నిర్మానుష్యంగా మారిన ఘాట్‌రోడ్డు

అనంతగిరి: మన్యం అంటే ప్రకృతి ప్రేమికులకు చాలా ఇష్టం.. ఇక్కడ పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు, సరదాగా గడిపేందుకు ఏపీ, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల ప్రస్తుతం ఎండల తీవ్రత అధికమవ్వడంతో పర్యాటకులు రావడం లేదు. దాంతో అరకు–విశాఖ ప్రధాన రహదారి అనుకున్న డముకు వ్యూపాయింట్ వద్ద ప్రదేశం నిర్మానుష్యంగా మారింది. బొర్రా గుహలు తిలకించే పర్యాటకుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. కటికి, సరియా, చిట్టంపాడు, తాటిగుడ జలపాతాలు నీరు లేకపోవడంతో సందర్శకుల సందడి కానరాలేదు. ఘాట్‌రోడ్డు పచ్చని చెట్ల అందాలను, ప్రకృతిని ప్రేమిస్తూ పర్యాటకులు మంత్రముగ్ధులయ్యేవారు. పర్యాటకుల వాహనాలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతం వెలవెలబోతోంది.

అత్తను హత్య చేసిన అల్లుడు

ఆరిలోవ(విశాఖ తూర్పు): ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలు హత్యకు గురైంది. అడిగిన డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో అత్తను అల్లుడు హత్య చేశాడు. పోలీసులు వివరాల ప్రకారం.. హనుమంతవాక దరి విజయదుర్గా కాలనీలో కొండపై బాణాల రాము అలియాస్ కరెంట్ రాము భార్య లక్ష్మి, ఆరేళ్ల కుమారుడితో నివాసముంటున్నాడు. అతని భార్యకు అనారోగ్యం కావడంతో ఇటీవల నగరంలో ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ జరిగింది. తన కూతురును చూసుకోవడానికి శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం ఎలమంచిలికి చెందిన గుణ నారాయణమ్మ(60) నాలుగు రోజుల క్రితం హనుమంతవాక వచ్చింది. ఆస్పత్రిలో తన కుమార్తెకు భోజనం వండి క్యారేజీ పంపిస్తుండేది. రాము కొన్నాళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం కోసం తన అత్తను రోజూ డబ్బులు అడుగుతుండేవాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో రెండు రోజులుగా గొడవపడుతున్నాడు. శనివారం ఉదయం కూడా గొడవ పడి అడిగిన డబ్బులు ఇవ్వనందుకు ఇనుప రాడుతో తలపై బలంగా కొట్టాడు. అధిక రక్తస్రావమై ఆమె కుప్పకూలింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ద్వారకా ఏసీపీ మూర్తి, ఆరిలోవ సీఐ సోమశేఖర్‌రావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడు రామును అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా హత్యకు ఉపయోగించిన రాడ్డు మాత్రం పోలీసులకు లభించలేదు. పోలీసులు క్లూస్ టీంను కూడా సంఘటన స్థలానికి రప్పించి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.